ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర

## (సఖినేటిపల్లిలో శ్రీనాన్నగారి ప్రవచనము, 1-3-97)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

శంకరాచార్యులవారు తల్లి అనుమతితో సన్యాసం తీసుకొన్నారు. ఆయన దేశ సంచారానికి వెళ్ళేముందు తల్లితో అమ్మానేను వెళ్ళి వస్తాను అని చెప్పారు. తల్లి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఆమె భర్త మరణించాడు. ఉన్న ఒక్క కుమారుడు సన్యాసం తీసుకొని వెళ్ళిపోతున్నాడు అందువలన ఆమెకు దుఃఖం కలిగింది. అప్పుడు ఆచార్యులవారు తల్లితో అమ్మా బాధపడవద్దు. దేశసంచారంలో నేను ఎవరిదగ్గర చదువు నేర్చుకొంటానో వారు నాకు తండ్రితో సమానము, నేను ఎవరికైతే చదువు చెపుతానోవారు నాబిడ్డలు. వివాహం కాలేదు నాకు భార్య లేదు అని బాధపడవద్దు నేను అనుభవించే శాంతే నాభార్య. ఇక తల్లికి దూరం అవుతున్నాను అని నీవు బెంగ పెట్టుకోవద్దు నాకు ప్రేమగా అన్నంపెట్టిన వారు అందరూ నాకు తల్లులే అని ఆచార్యులవారు తల్లితో చెప్పారు.

మానవుని బంధించేది దేహబుద్ది. దేహబుద్ది నశించిన వెంటనే నీహృదయంలో ఉన్న నిజం నీకు తెలియబడుతుంది. పూజ చేస్తున్నారు, జపాలు చేస్తున్నారు, ధ్యానాలు చేస్తున్నారు. దేహబుద్దిని నశింపచేయటమే వీటి యొక్క ప్రయోజనం. నీకు రోగం వచ్చింది అనుకో. మందువాడతావు. మందువాడటంవలన రోగం ఎంతవరకూ తగ్గుతోందో చూసుకోవాలి. అలాగే నీవు చేసే పూజవలన, జపంవలన, ధ్యానం వలన నీ దేహబుద్ది నశిస్తోందో లేదో చూసుకో. అంతేగాని ఇన్నిగంటలు పూజలు, జపాలు చేస్తున్నాము అని లెక్కపెట్టుకోవటంకాదు. దేహబుద్ది నశించనంతకాలం నీవు కోటిజన్మలు ఎత్తి ఇలా సాధనలు చేసినా నీకు సత్యం తెలియబడదు. భగవంతుడు నీ హృదయంలోనే ఉన్నాడు. కాని ఆయన నీకు అనుభవంలో లేడు. ఇప్పుడు నీకు దేహం తెలుస్తోంది, మనస్సు తెలుస్తోంది, బుద్ది తెలుస్తోంది. తెలియని దానిని వదిలివెయ్యి. దేహం నీకు తెలుస్తోంది కదా ఆ దేహం సహాయంతో మంచిపని చేయి. అది కర్మయోగం. నీకు మనస్సు తెలుస్తోంది కదా దానితో భగవంతుని నిరంతరం స్మరించు, ఆయన రూపాన్ని ధ్యానం చెయ్యి అది భక్తియోగం. నీకు బుద్ది తెలుస్తోందికదా దాని సహాయంతో బుద్దియొక్క మూలాన్ని వెతుకు అది జ్ఞానంయోగం. నీకు తెలిసిన వాటిని బాగా ఉపయోగించుకొని ప్రయత్నంచేస్తే నీ హృదయంలో భగవంతుడు ఉన్నాడు ఆయన నీకు తెలియబడతాడు. నీకు నచ్చిన మార్గంలో ప్రయాణం చెయ్యి, నీకు జ్ఞానయోగం నచ్చనంత మాత్రంచేత ప్రయాణం మానవద్దు. నీకు ఏయోగం నచ్చితే అందులో ప్రయాణం చెయ్యి. జ్ఞానయోగం విమానంలో ప్రయాణం లాంటిది, విమానంలో ప్రయాణం చేయటానికి తగిన ధనం నీకు లేకపోతే కారులో గాని, రైలులోగాని ప్రయాణం చెయ్యి. అలాగే నీకు జ్ఞానమార్గంలో ప్రయాణం చేయటానికి తగిన యోగ్యత లేకపోతే, ఆ మార్గం నీకు ఇష్టం కాకపోతే ప్రయాణం మానవద్దు. భక్తియోగంగాని, కర్మయోగంగాని ఏదో ఒక యోగమును తీసుకొని, జ్ఞానిని ఆశ్రయించి, ఒక దేవతాపురుషుని ఆరాధించి గమ్యమును చేరటానికి ప్రయత్నంచెయ్యి. మనం భగవంతునికి దూరంగా ఉంటున్నాము. మన దేహానికి, ఆస్తులకు, స్నేహితులకు దగ్గరగా ఉంటున్నాము. మరణానంతరము మనకూడా ఏదైతే రాదో వాటికి మనం దగ్గరగా ఉంటున్నాము.

ఇదే మాయ. బంధువులు, స్నేహితులు మనలను మోసంచేయవచ్చుకాని భగవంతుడు ఎప్పుడూ మనలను మోసం చేయడు అంతేకాదు మరణానంతరము మనకూడా వస్తాడు.

మిగిలిన వస్తువులు ఏమీ దొరకక పోయినా ఎక్కడకు వెళ్ళినా మనకు గాలి ఉంటుంది. గాలి చాలా ఉంది అని ఆగాలిని అంతా మనం పీల్చుకోము. మనకు ఎంత వరకు అవసరమో అంత గాలిని మాత్రమే మనం పీల్చుకొంటాము. అలాగే ఈ ప్రపంచములో అనేక విషయాలు, వస్తువులు ఉంటాయి. నీకు ఎంతవరకూ అవసరమో అంతవరకే వాటిని తీసుకో అంతకంటే ఎక్కువ అనుభవించవద్దు. నీరు దొరకకపోతే నీటికోసం బావి దగ్గరకు వెళ్ళాలి. అంతటా నీరే ఉన్నప్పుడు నీవు బావి దగ్గరకు వెళ్ళనక్కరలేదు. అలాగే నీకు ఆత్మసుఖం కలిగినపుడు అంటే సుఖమే నీస్వరూపంగా వ్యక్తమయినపుడు చిల్లర సుఖాలకోసం వెతకవలసిన పనిలేదు.

నీ మనస్సు బాహ్యంగా విజృంభిస్తోంది. దేవుడిని బాహ్యంగా వెతుకుచున్నావు. దేవుడు నీ హృదయంలో ఉన్నాడు. నీ హృదయంలో వెతకటం మానివేసావు. హృదయంవైపుకు చూడటం మానివేసావు. నీ మనస్సును హృదయంవైపుకు పంపటం మానివేసావు. నీ ప్రయత్నం లేకుండా నీ మనస్సు బాహ్యంగా విజృంభిస్తోంది. దేవుడు హృదయంలో ఉన్నాడు కాబట్టి ఏగురువు అయినా నీ మనస్సును అంతర్ముఖం చేయటానికి చూస్తాడు. ఎక్కడ దేవుడు ఉన్నాడో అక్కడకు నీ మనస్సును తీసుకొని వెళ్ళటానికి సహాయసహకారములు అందించే వాడే గురువు. నీకు కర్మఫలం మీద ఉన్న ఆసక్తి ఈశ్వరుడు మీదలేదు. కర్మఫలం వస్తుంది అనుభవిస్తే పోతుంది. నాలుగు రోజులు అనుభవిస్తే పోయే దాని మీద ఉన్నప్రీతి పరమేశ్వరుడిమీద లేదు. మీ మొఖాలు అటు తిరగటం లేదు.

డ్రామాలలో వేషాలు వేసేవారు ఆ డ్రామా అయిపోయిన వెంటనే ఆ వేషాలను తీసి వేస్తారు. అలాగే ఈ రూపాలు, నామాలు ఇవి అన్నీ వేషాలు. ఈ వేషాలనుండి మీరు బయటపడాలి. మీలోపల ఉన్న సత్యవస్తువు మీకు తెలిసిన వెంటనే ఈ నామాలతోటి, రూపాలతోటి ఉన్న తాదాప్యం దాని అంతట అదే తెగిపోతుంది. కొంతమంది మాకు ఆ బాధ వస్తుంది, ఈ బాధ వస్తుంది అని ఎక్కువగా ఊహించుకుంటారు. మీరు ఊహించుకునే ఆ బాధలు రావు. మీకు ఆ బాధలు రాకుండానే మనస్సులో ఊహించుకొని ఆతలంపులలో పడి ఎక్కువ కష్టపడిపోతున్నారు. అందువలన ఎక్కువగా ఊహించుకోవద్దు. ఊహించుకోవటం వలన కాలము, శక్తి వృధా అవుతుంది. మరణసమయం వచ్చినప్పుడు 10 నిమిషాలు ఆగమన్నా మృత్యుదేవత ఆగదు. కసాయి వాడు గొర్రెతలను ఏవిధంగా అయితే లాగి నరుకుతాడో అలాగ మరణసమయం వచ్చినప్పుడు మృత్యుదేవత మిమ్మలను బలవంతముగా నరికి శరీరం నుండి జీవుడిని వేరు చేసి తీసుకొనిపోతాడు. కాలం మారుతోంది, దేహాలు మారిపోతున్నాయి, సృష్టి మారిపోతోంది. కాని సృష్టికి ఆధారంగా ఉన్న వస్తువులో మార్పులేదు. ఈ మారేది ఏదీ నువ్వుకాదు. ఈ మారే వస్తువులకు ఆధారంగా మారనిది ఒకటి ఉంది. అదే నువ్వు అంటున్నారు ఆచార్యులవారు.

కొంత మంది శాస్త్రమును ప్రమాణంగా పెట్టుకొని జీవిస్తారు. నీ శరీరానికి మరణంఉంది, జననం ఉంది కాని నీ హృదయంలో ఉన్న సత్యవస్తువుకు చావులేదు, పుట్టుకలేదు. దానికి చావులేదు, పుట్టుకలేదుకాబట్టి ఆవస్తువును తెలుసుకొంటే నీవు కూడా చావులేని స్థితికి ఎదిగి వెళ్ళిపోతావు అని శాస్త్రము చెపుతోంది. ఇది

శాస్త్రప్రమాణము. అప్పుడు మృత్యుంజయుడవు అవుతావు. అప్పుడు నీకు దేహం ఉన్నా, లేకపోయినా ఒక్కటే. దేహం ఉంటే దానికి అదనంగా చాకిరీ చేయాలి. దానిని ముస్తాబు చేయటానికే టైము అంతా సరిపోతుంది. ఇంతా ముస్తాబు చేసి బయటకు వెళితే ఈ శవాన్ని ఎవడైనా తిడితే చనిపోయేవరకూ వాడిమీద కోపం, దీనిని ఎవడైనా పొగిడితే వాడితో బంధం పెట్టుకొంటారు.

భగవంతుడు ఉన్నాడు అని కొంతమంది, భగవంతుడు లేడు అని కొంతమంది చెపుతున్నారు. భగవంతుడు లేడు అని బ్రతకటంకంటే ఉన్నాడనే నీవుబ్రతుకు. భగవంతుడు ఉన్నాడు అని బ్రతుకుచున్నావు అనుకో నిజంగా భగవంతుడు ఉంటే నీకు అనంతమైన లాభం కలుగుతుంది. భగవంతుడు ఉన్నాడు అని బ్రతుకుచున్నావు అనుకో భగవంతుడు లేడు అనుకో నీకు వచ్చే నష్టంలేదు. భగవంతుడు లేడు అని బ్రతుకుచున్నావు అనుకో నిజంగా ఉంటే నీ పరిస్థితి ఏమిటి అది అర్థం చేసుకో. శరీరం మరణించినప్పుడు అజ్ఞాని యొక్క ప్రాణం ప్రయాణం చేస్తుంది. జ్ఞానియొక్క ప్రాణం హృదయంలో లయిస్తుంది. మరణసమయంలో ఏదైతే మనస్సులో బలంగా ఉందో అదే వచ్చి పట్టుకొంటుంది. చనిపోయేటప్పుడు వ్యవసాయదారుడు వ్యవసాయం గొడవలలో, డాక్టరు పేషంట్లు గొడవలో , లాయరు కోర్టు గొడవలో ఉంటాడు. అంటే ఏదైతే వారి మనస్సులో బలంగా ఉందో అదే వస్తుంది. మనస్సు దానినే చింతిస్తూ ఉంటుంది. కాని జ్ఞానికి చింతించటానికి ఏమీలేదు ఎందుచేతనంటే తనకంటే వేరుగా ఏమీలేదు. నీ శరీరం ఒక తొడుగు, నీ మనస్సు ఒక తొడుగు, నేను తెలివైన వాడిని అనుకొంటావు అది ఒక తొడుగు. ఆ తొడుగులను చూసి మురిసిపోవద్దు. ఆతొడుగులను తీసివెయ్యి. ఆ ముసుగులో నుండి బయటకు రా. నీవు ఏదైతే కాదో అది అవును అనుకొని ఎంతకాలం అయితే భ్రాంతి పడతావో అంతకాలం నీవు ఏదైతే అవునో అది నీకు తెలియదు. నీవు ఎవడో నీకు తెలియదు. మనశరీరం ఎదిగి పోతోంది. మనలో కుర్రచేష్టలు ఇంకాపోలేదు. మనబుద్ధి ఎదగలేదు. హృదయం విశాలంకాలేదు.

అహంభావనను పెంచుకొంటూ ఉంటే మీరు బ్రహ్మభావనను పట్టుకోలేరు. దేహంతోటి, రంగుతోటి, నామంతోటి, కుటుంబంతోటి మీరు తాదాప్యం పొందవద్దు. వీటితో తాదాప్యం పొందితే మిథ్యానేను పెరిగిపోతుంది. ఏనేనును అయితే విడిచి పెట్టాలి అనుకొంటున్నారో అది బలపడిపోతుంది. నేను సంపాదించాను, నేను అనుభవిస్తున్నాను, నాకు ఈ పదివి వచ్చింది, ఇంతగౌరవం వచ్చింది ఇవి అన్నీ మిథ్యానేను గొడవలే. కర్తృత్వం, భోక్తృత్వం ఇవి అన్నీ మిథ్యానేను గొడవలే, నిజమైన నేనుకు వీటితో సంబంధంలేదు. వీటి అన్నింటికి నిజమైన నేను అతీతంగా ఉంది. దేవుని పేరు ఏమిటి అంటే ఉండటమే. నీ శరీరం ఉండవచ్చు, ఊడిపోవచ్చు. ఈప్రపంచం నీకళ్ళకు కనపించవచ్చును లేక కనబడక పోవచ్చును. భగవంతుడు నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు వీటితో సంబంధం లేకుండా ఇవి అన్నీ ఉన్నా లేకపోయినా నీ ఉనికికి భంగంలేదు. అది తెలుసుకో నీవు ఎప్పుడూ ఉంటావు. హృదయంలో ఉన్న వస్తువు సూక్ష్మాతి సూక్ష్మంగా ఉంటుంది. ఆ సూక్ష్మాతి సూక్ష్మంగా ఉన్న వస్తువును పట్టుకోవటానికి తగిన వివేకం ఇమ్మని భగవంతుని ప్రార్థించాలి. భగవాన్ ఎంత అందంగా చెప్పారో చూడండి. శరీరం మరణించిన తరువాత ఏ నేనును అయితే వైకుంతమునకు, కైలాసమునకు పంపుదామని చూస్తున్నావో ఆనేనులో నుండి విడుదల పొందటమే మోక్షం అన్నసంగతి నీకు తెలియటం లేదు అన్నారు భగవాన్.